మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్/వనపర్తి/జోగులాంబ గద్వాల/నారాయణపేట

## హ్యాట్రిక్ దిశగా గువ్వల అడుగులు..!

- పదేళ్ల అభివృద్ధే మళ్లీ గెలిపిస్తుంది..
- అహర్నిశలే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేశా...
- బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాల సంక్షేమం...
- అప్పర్ ప్లాట్‌కు కృష్ణమ్మ నీళ్లు అందించడమే నా ధ్యేయం...
- ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు


ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల

**అచ్చంపేట,ఆగస్టు25 ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో ఆది నుంచి స్వరాష్ట్ర కళ నేరవేర్చేంత వరకు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉన్నానని, నియోజకవర్గ, మండలస్థాయిల్లో నిర్వహించిన సభలు, సమావేశాల్లో ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రతినిత్యం ప్రజలకు వివరిస్తున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో మరోసారి గెలిచి హ్యాట్రిక్ దిశగా అడుగులు వేయాలని కంకణబద్దులై ముందు కు సాగుతూ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేస్తూ ముందడుగు వేస్తున్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో సాధించిన ప్రజాభివృద్ధి, సంక్షేమ పథకాలు మళ్లీ గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తూ ఇచ్చిన హామీలను నేరవేర్చకపోతే నేను ఓట్లడగనని, అంబేద్కర్ ఇచ్చిన ఓటు ఆయుధంతో మీ నిర్ణయం తీసుకోవచ్చునంటున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా ఏ ముఖ్యమంత్రి చేయలేని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నారని, ఆ సంక్షేమ పథకాలే దేశానికి ఆదర్శమవుతున్నాయని, రానున్న ఎన్నికల్లో ఆ సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజలే ముందుకొచ్చి నన్ను గెలిపిస్తారనే నమ్మకం నాకు ఉందని పేర్కొంటున్నారు. తాను ఉద్యమ నాయకుడిగా రెండు పర్యాయాలు అచ్చంపేట ఎమ్మెల్యేగా అనునిత్యం ప్రజా సంక్షేమం, సబ్బండ వర్గాల అభ్యున్నతి, అభివృద్ధి ధ్యేయంగా పనిచేశానని, ఉమమహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ సాధించి కృష్ణా నదీ జలాలతో సాగు, తాగునీరు లేక అల్లాడుతున్న నల్లమల్ల గిరిజన బిడ్డలకు ఆ ఇబ్బందులు లేకుండా ఉమమహేశ్వర లిఫ్ట్ సాధించి కృష్ణా నదీ జలాలతో అప్పర్ ప్లాట్‌కు సాగునీరు అందించడమే తన ధ్యేయంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. రైతన్నలకు వ్యవసాయంపై మక్కువ పెంచేందుకు వెనుకబడిన ప్రాంతం అచ్చంపేట నియోజకవర్గంలో వెనుకబడిన ప్రజల అభివృద్ధి కోసం కేఎల్ఐ, డీఎల్ఐ కాల్వల నిర్మాణంతో సాగునీటిని అందించి వ్యవసాయాభివృద్ధిని చేశానని, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సాగు కోసం పెట్టుబడి సహాయం అందించడంతో పాటు ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకోవడానికి అందిస్తున్న రైతు భీమా ఎక్స్‌గ్రేషియాను వారంలోపు ఆ కుటుంబానికి అందే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టి రైతు కుటుంబాలకు అండగా నిలిచానని,ఆ కుటుంబాల మమకారమే నా గెలుపుకు దోహద పడుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 100 పడకల ఆసుపత్రిని నిర్మించి నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగానన్నారు. ఏ సమయంలోనైనా ఆపద ఉందని అడిగిన వారికి సహాయం చేస్తూ నియోజకవర్గ ప్రజలకు నేనున్నాననే భరోసాను కల్పిస్తూ నియోజకవర్గ ప్రజల మన్ననలను పొందుతూ ప్రజలకు చేరువయ్యానని, ప్రజల మమకారం, అప్యాయతనే రానున్న ఎన్నికల్లో అచ్చంపేట నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేసేందుకు దోహద పడుతాయని, అచ్చంపేట కోటాపై గులాబి జెండాను ఎగురవేసి రాష్ట్రంలో మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు నల్లమల్ల ప్రాంత ప్రజల ఆశీర్వాదంతో ముందుకు సాగుతానని పేర్కొంటూ నా ఆత్మ విశ్వాసాన్ని అచ్చంపేట ప్రజలు ఒమ్ము చేయరనే ధీమాతో ముందడుగు వేస్తున్నానన్నారు.

## ఆర్డీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి


ఆర్డీఓ కార్యాలయంలో ఫైళ్లు పరిశీలిస్తున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త :** ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం గద్వాల ఆర్డీఓ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అన్ని గదులను పరిశీలించారు. కార్యాలయంలో ఫైళ్లు, రికార్డులు, క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసి అవసరమైన వాటిని ఆన్‌లైన్ చేయాలన్నారు. ఉద్యోగులు సకాలంలో విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని ఆర్డీఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, కార్యాల య సిబ్బంది ఉన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో మన్యంకొండకు రోప్‌వే..

**రోప్‌వే ద్వారా నేరుగా దైవదర్శనానికి**
**తెలంగాణ తిరుపతిని అద్భుతంగా తీర్చిదిద్దుతాం**
**ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డిజైన్ పరిశీలించిన మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**



రోప్‌వే డిజైన్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రోప్ వే స్కైవాక్ డిజైన్ నమూనాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 25 ప్రభాతవార్త :** మన్యంకొండ దేవాలయం వద్ద రాష్ట్రంలోనే మొట్టమొదటి రోప్ వేను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. విదేశాల్లో ఉన్న కేబుల్‌కార్ కంటే మన రోప్‌వే మరింత అద్భుతంగా ఉండనుందని ఆయన వివరించారు. మన్యంకొండ రోప్‌వేకు అనుసంధానంగా కొండమీద ఏర్పాటు చేయనున్న ల్యాండింగ్, ల్యాండ్ స్కేపింగ్,స్కైవాక్, అన్నదాన సత్రం, లడ్డు కౌంటర్, కోనరు తుది డిజైన్లను కన్సల్టెంట్లతో ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. పేదల కొంగు బంగారం తెలంగాణ తిరుపతి అయిన మన్యంకొండ దేవాలయాన్ని యాదాద్రి, వేములవాడ తరహాలో అద్భుతంగా తీర్చిదిద్దుతామని, ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మన్యంకొండ వద్ద చేపడుతున్న రోప్‌వేను స్విట్జర్లాండ్, దక్షిణ కొరియాలో ఉన్న రోప్‌వేల కంటే అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా తెలిపారు.

**కేబుల్ కార్‌దిగి స్కై వాక్ ద్వారా నేరుగా గుడిలోకి..**

కొండపైన కేబుల్ కార్ ల్యాండింగ్ అయిన తర్వాత భక్తులు నేరుగా దైవదర్శనానికి వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా స్కైవే నిర్మాణం చేపడుతున్నామని అధునాతన అన్నదాన సత్రం, లడ్డు కౌంటర్, కోనేరు నిర్మాణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కొండపైన దిగువన ల్యాండ్ స్కేపింగ్ అత్యద్భుతంగా ఉండనున్నాయన్నారు. రోప్‌వే స్టేషన్ వద్ద పార్కింగ్ ఏరియా, రెస్టారెంట్, ల్యాండ్ సేప్కింగ్, విశాలమైన పార్కింగ్ ఏరియాలను ఏర్పాటు చేస్తామన్నారు.కొండ దిగువన అలివేల మంగ దేవాలయం, మెయిన్ రోడ్డుకు కుడివైపు నుంచి కొండపైకి సుమారు కిలోమీటరు మేర రోప్‌వే నిర్మించనున్న ఈ రోప్‌వే వల్ల పర్యాటకులు, భక్తుల సంఖ్య మరింతగా పెరుగుతుందని, అందుకనుగుణంగా ఆధునిక హంగులతో సకల సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. కొండ దిగువన పర్యాటకుల సౌకర్యం కోసం ఇప్పటికే పెద్ద హరిత పర్యాటక హోటల్ పనులు కొనసాగుతున్నాయన్నారు. సీఎం కెసిఆర్ పర్యాటక అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని ఫలితగానే అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని పేర్కొన్నారు. ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పర్యాటకశాఖ ఓఎస్డీ సత్యనారాయణ, టూరిజం కన్సల్టెంట్ కల్పేష్ పటేల్, ఇతర అధికారులు ఉన్నారు.

## మైనార్టీల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి



**కోయిల్‌కొండ,ఆగస్టు 25 ప్రభాతవార్త :** మైనార్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతుం దని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో మండలంలోని మైనార్టీలకు మైనార్టీబంధు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజానీకానికి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకోవడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజాసంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అనంతరం మండల కేంద్రమైన కోయిల్‌కొండకు చెందిన అమీర్‌ఖాన్, సుల్తాన్ అహ్మద్‌ఖాన్, షాహిజాన్ సుల్తాన్ తదితరులకు మైనార్టీ బందు చెక్కులను ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ముస్లిం సోదరులకు మైనార్టీ బంధు చెక్కులను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పంపిణీ చేసినందుకు ఎంపిపి శశికళా భీంరెడ్డి, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, కోయిల్‌కొండ సర్పంచ్ బి. కృష్ణ ఎమ్మెలేనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసరనపంచ్ ఖాజానవాజ్, టిఆర్ఎస్ పార్టీ మైనార్టీ మాజీ అధ్యక్షులు అబ్దుల్‌జహీద్ పాల్గొన్నారు.

## పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి:ఎమ్మెల్యే

**బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 25 ప్రభాతవార్త :** రైతులకు 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు భీమా పథకాలతో పాటు విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచుతూ అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి ఆధ్వర్యంలో ఖరీదుదారులు, కమిషన్ దారులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడవసారి జడ్చర్ల అసెంబ్లీ టికెట్ పొందడంపై ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక గత తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను గమనించాలని కోరారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌ను కూడా అభివృద్ధి చేశామని, వేల మెట్రిక్ టన్నులు నిల్వచేసే గోదాములు నిర్మించామని తెలిపారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే అన్ని పనులు, వ్యాపారాలు బాగా జరుగుతాయని, అందరికి అన్నంపెట్టే రైతులు బాగుండాలనే సీఎం కెసిఆర్ రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా చర్చ జరపాలని, పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య, మార్కెట్ కమిటి ఛైర్మన్ మన్నెం గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ మహమ్మద్ డానిష్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు, ఖరీదుదారులు, కమిషన్ దారులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో ఆత్మకూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ..

- తండ్రి పేరున ఉన్న భూమిని విరాసత్ చేసేందుకు రూ.10వేలు డిమాండ్
- మధ్యవర్తితో రూ.5వేలకు కుదిరిన ఒప్పందం - ఏసీబీని ఆశ్రయించిన బాధితులు
- ఆర్ఐ నరసింహులును ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు : ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్


ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం



లంచం తీసుకుంటు ఏసీబీకి పట్టుబడిన ఆర్ఐ నరసింహులు

**అమరచింత,ఆగస్టు 25, ప్రభాతవార్త:** తండ్రి మరణంతో అతని పేరు మీద ఉన్న భూమిని తన కుమారుల పేరు మీద విరాసత్ (పట్టా మార్పిడి) చేసేందుకు ఆత్మకూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహులు రూ.10వేలు డిమాండ్ చేసి రూ.5వేలకు ఒప్పందం కుదుర్చుకొని శుక్రవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో రూ.5వేలు లంచం తీసుకుంటుడగా ఆర్ఐ నరసింహులు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధి లోని మోట్లంపల్లి గ్రామానికి చెందిన గట్టన్న అనే రైతు మృతి చెందడంతో ఆయన వారసులకు విరాసత్ చేయాల్సి ఉంది. తమకు విరాసత్ చేయాలని ఆర్ఐని గత నెల రోజుల నుండి కోరడంతో మోట్లంపల్లికి వెళ్లి పంచనామా చేయాలని గత నెల రోజుల నుండి బాధితులను నరసింహులు వేధించడం మొదలుపెట్టాడు. తీరా ఒకరోజు గట్టిగా నరసింహులును నిలదీస్తే రూ.10 వేలు ఇస్తేనే తాను పంచనామా రిపోర్టును తహసీల్దార్‌కు పంపిస్తానని చెప్పడంతో మధ్యవర్తి సహకారంతో పదివేల రూపాయల లంచాన్ని ఐదువేల రూపాయలకు ఒప్పందం చేసుకుని బాధితులు మహబూబ్ నగర్‌లోని ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్‌ను సంప్రదించారు. వారి సూచన మేరకు శుక్రవారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ఐదు వేల రూపాయలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహులుకు ఇచ్చి బాధితులు బయటికి వచ్చిన వెంటనే ఏసీబీ అధికారులు ఆర్ఐ నరసింహులును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆర్ఐ నరసింహులును నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరుస్తామని ప్రభుత్వ అధికారులు ప్రజలను లంచం కోసం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఫిర్యాదు చేసిన వారి సమాచారాన్ని రహస్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపారు.

# కుల వృత్తులకు అండగా తెలంగాణ ప్రభుత్వం..

- సామాన్యులకు అండగా నిలవాలి అన్నదే కేసీఆర్ ఆలోచన
- అందరూ బాగుండాలి.. అందులో మనం ఉండాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తిటౌన్ ,ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కుల వృత్తులకు అండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని, సామాన్యులకు అండగా నిలవాలన్నదే కేసీఆర్ ఆలోచన అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 395 మందికి రూ.3.95 కోట్ల విలువైన బీసీ బంధు ప్రొసీడింగ్స్, 361 మంది దివ్యాంగులకు పెంచిన పింఛన్ రూ.3016 నుండి రూ.4016 ప్రొసీడింగ్స్ లను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.... కుల వృత్తులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉందని, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుభీమా, కళ్యాణ లక్ష్మి, న్యూట్రిషన్ కిట్ల మాదిరిగా పార్టీలకు , రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయని మంత్రి అన్నారు. కుల వృత్తుల వారికి గతంలో మాదిరిగా వారికి ఉపాధి ఇవ్వడం లేదని, వారికి ఆర్థిక చేయూత ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఆలోచన అన్నారు. వారికి దశల వారీగా అందరికీ రూ.లక్ష సాయం అందజేశామని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే విడతల వారీగా ప్రతి ఒక్కరికీ సాయం అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 395 మందికి బీసీ బంధు ద్వారా రూ.లక్ష చొప్పున తొలి విడత చెక్కులు ఇస్తున్నామని, పని చేసుకునే ప్రతి చేతికి పని కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం అని మంత్రి పేర్కొన్నారు. గత 9 ఏళ్లలో సీఎం కేసీఆర్ అదే లక్ష్యంతో పని చేస్తున్నారనీ, నేడు తెలంగాణ నుండి వలసలు ఆగిపోయాయని , ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చి ఉపాధి పొందుతున్నారని ఆయన తెలిపారు. అన్నార్తులకు అండగా నిలవాలన్నదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని , వారికి ఆసరా పింఛన్లు ఇస్తున్నారని, దివ్యాంగులకు పింఛన్ రూ.4016 కు పెంచడం మూలంగా వనపర్తి నియోజకవర్గంలో 6551 మందికి లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. రైతును నిలబెట్టాలన్న ఉద్దేశ్యంతో ఉచిత కరెంటు, రైతు భీమా, రైతుబంధు, సాగునీళ్లు ఇస్తు పండించిన పంటలు కొనుగోలు చేస్తు అండగా నిలుస్తున్నామని ఆయన తెలిపారు. వ్యవసాయం బాగుపడడంతో దాని చుట్టు అల్లుకున్న రంగాలు నిలదొక్కుకుంటున్నాయని, వ్యవసాయ రంగం బలపడడంతో అనేక వ్యాపారాలు నూతనంగా ఏర్పాటు అవుతున్నాయని ఆయన అన్నారు. ఒక్క వనపర్తిలో వెయ్యికి పైగా బంగారు దుకాణాలు , 50 వరకు బిర్యానీ సెంటర్లు ఏర్పాటు అయ్యాయని, కార్ల షోరూంలు, బైక్ షోరూంలు , సూపర్ మార్కెట్ల రాకతో వేల మందికి కొత్తగా ఉపాధి లభిస్తుందని ఆయన అన్నారు. ఒకప్పుడు పదెకరాల రైతు కూడా తిండికి తండ్లాడిన పరిస్థితి ఉండేదని, తెలంగాణ రాష్ట్రంలో ఆ దుస్థితి నుండి గట్టెక్కడం తెలంగాణ సాధించిన విజయమని మంత్రి వెల్లడించారు. సమాజంలో వెనుకబడిన వారికి కార్పోరేషన్ల ద్వారా చేయూతనందిస్తామని, రాజకీయాలు, పైరవీలు, దళారులకు అతీతంగా సర్కారు పథకాల అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. పని చేసిన ప్రభుత్వానికి ప్రజలు చేయూతనందించి అండగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ... ప్రజలకు అండగా ప్రభుత్వ పథకాలు ఉన్నాయని, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు వంటి పథకాల ద్వారా ఆదుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు ఉన్నతంగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంస్థల చైర్మన్ రాజా వరప్రసాద్ రావు, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్ గౌడ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు, జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, సింగిల్‌విండో చైర్మన్లు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గొర్రెలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**నారాయణపేట ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని విఠలాపూర్, దేశాయిపల్లి, అయ్యవారిపల్లి గ్రామాలలో మొత్తం 59 యూనిట్ల గొర్రెలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మందికి ప్రభుత్వ పథకాలు అందించడానికి ముందుంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు,ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియకు ప్రత్యేక క్యాంపెయిన్‌ల ఏర్పాటు: జిల్లా కలెక్టర్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఆగస్టు 26,27 తేదీలతో పాటు సెప్టెంబర్ 2,3తేదీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా లోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆగస్టు 27,28 శని ఆదివారాల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సంబంధిత పోలింగ్ బూత్‌కు సంబంధించిన ఓటర్ జాబితాను పట్టుకొని యువతీ యువకులు, ఓటర్లందరు ఓటరు జాబితాను పరిశీలించుకోవా లన్నారు. ఒక వేళ తన పేరు ఓటరు జాబితాలో లేకున్న లేదా ఏదైనా మార్పులు చేర్పులు చేయించుకోవాలనుకున్న అక్కడే బూత్ లెవల్ అధికారుల వద్ద సంబంధిత ఫారం తీసుకొని ధరఖాస్తు చేసుకోవాలన్నారు. 2023 అక్టోబర్ 1నాటికి 18ఏళ్ల నిండబోయే వారు లేదా ఇప్పటికే 18 సంవత్సరాల వయస్సు దాటిన వారు ఓటరు జాబితాలో తమ పేరును ఫారం 6 ద్వారా లేదా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగులు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటు కలిగి ఉన్న వారు సైతం మరొకసారి తమ పేరును జాబితాలో పరిశీలించుకోవాలని, ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం 7 లేదా 8 ద్వారా సరి చేసుకోవచ్చునని తెలిపారు. మార్పులు, చేర్పులు, సవరణల ఉంటే ఫారం-8లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 26,27 తేదీల్లో రెండు రోజులతో పాటు సెప్టెంబర్ 2,3 తేదీల్లో మరో రెండు రోజుల పాటు ఇదే తరహా ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనిని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 115మంది అభ్యర్థులను ప్రకటించిన దమ్మున్న నేత కేసీఆర్

- 14సీట్లు మావే...
- జడ్చర్ల 3వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- చైతన్యనగర్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


3వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మైసమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు25, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 సీట్లు గెలుస్తామని, రాష్ట్రంలోని 115 అసెంబ్లీ స్థానాలకు ఒకే సారి అభ్యర్థులను ప్రకటించిన దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు రవీంద్రనగర్, రాజీవ్‌నగర్, సరస్వతీనగర్, సత్యనారాయణ స్వామి టెంపుల్ ఏరియాలో ఎమ్మెల్యే స్థానిక కౌన్సిలర్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ప్రజలతో ముఖాముచ మాట్లాడారు. వారిసమస్యలను నేరుగా తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా, డ్రైనేజీలు సిబ్బంది నిత్యం శుభ్రం చేస్తున్నారా అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే అధికారులు, కౌన్సిలర్ వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు అందరూ కూడా 2018 కంటే ఎక్కువ మెజార్టీలో గెలుస్తారని చెప్పారు.

**తెలంగాణ వచ్చాకే అధికారికంగా బోనాలు..**

తెలంగాణ వచ్చాకే మన పండుగలకు గుర్తింపు వచ్చిందని,బోనాలను నేడు ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. సాయంత్రం జడ్చర్లలోని చైతన్య నగర్ పరిధిలోని మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాలు ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతో షాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు.

## ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా..

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి
- కలెక్టరేట్ ముట్టడిలో బీజేపీ నేతల అరెస్ట్


కలెక్టరేట్ వద్ద వీరబ్రహ్మాచారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


పోలీస్‌స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు25, ప్రభాతవార్త:** ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఏంటని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందంరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన దళితులకు మూడెకరాలు భూమి, నిరుద్యోగ భృతి, రేషన్ కార్డులు, బీసీ బంధు, దళిత బంధు వంటి అనేక రకమైన పథకాలు, సమస్యలపై ప్రశ్నించేందుకు బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మహబూబ్‌నగర్ నూతన కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన నేతలను పోలీసులు అరెస్టు చేశారు. కొంతమందిని హౌస్ అరెస్టులు చేసి, మరికొందరిని మార్గమధ్యంలోనే అరెస్టు చేసిన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారని చెప్పారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ స్టేషన్‌లో మీడియాతో జితేందర్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ చేసే అక్రమాలకు అవినీతికి వత్తాసు పలికే వారిని రానున్న రోజుల్లో ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని అన్నారు. ప్రజలు నీతివంతమైన పాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రానున్నది బీజేపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కృష్ణవర్ధన్‌రెడ్డి, కోశ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంజయ్య, కౌన్సిలర్ రామాంజనేయులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి , కృష్ణవేణి, లక్ష్మీదేవి, యాదమ్మ పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి..

**వైద్యాధికారికి వినతి పత్రం సమర్పించిన సిఐటియు నాయకులు**

**మాగనూరు,ఆగస్టు 25 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ప్రాథమిక వైద్యాధికారి (పిహెచ్‌సి) ఆశాల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొంటారని డా. వెంకటరమణకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కో కన్వీనర్ పుంజనూర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయకుండా పారితోషికం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటూ ఉన్న పరిస్థితి. అదేవిధంగా ఆశా కార్యకర్తలు పారితోషికం వద్దని కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఆశ వర్కర్లు, యూనియన్ కార్యక్రమాలు తీసుకోవడం జరిగింది. కార్యక్రమంలో డా. వెంకటరమణకు వినతి పత్రం ఇచ్చారు. డివైఎఫ్ఓ జిల్లా నాయకులు జి.నరేష్, ఆశ వర్కర్లు కృష్ణవేణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబాలకు ఫ్యాన్లు పంపిణీ

**గండీడ్,ఆగస్టు25 ప్రభాతవార్త:** మండలకేంద్రానికి చెందిన జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు హరిందర్‌రావు తన తాత సురెందర్‌రావు, నాయనమ్మ అనసూయమ్మల జ్ఞాపకార్థమై శుక్రవారం గండీడ్ మండల కేంద్రానికి చెదిన నిరుపేద కుటుంబాలకు 10 ఫ్యాన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న దాంట్లో పేదలకు కొంతైనా సహాయం చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇంకా రానున్న రోజుల్లో గ్రామ పెద్ద సహకారంతో పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి బాలయ్య, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పారాసు హరిందర్‌రావు, శివగౌడ్, రాఘవేందర్‌చారి పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గాంధిభవన్‌లో దరఖాస్తు..

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి**

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త :** రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా గద్వాల ఎమ్మెల్యే నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకోవడం జరిగింది. గత 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ అందరి సహకారంతో జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పని చేయడానికి అవకాశం ఇచ్చిన మీ అందరికి కూడా ధన్యవాదాలు తెలియజేస్తూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేయడానికి మీ అందరి సహకారాన్ని అర్థిస్తున్నాను. అలాగే గద్వాల రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ముందు వరుసలో ఉంటూ గద్వాల, తాలూకాలోని ఊరు తిరిగి ఇక్కడ ప్రజల నేపథ్యం ప్రజల అవసరాలు గ్రామ సమస్యలు, రిజర్వాయర్, కాలువలు, రోడ్ల విషయాల మీద పోరాటం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు.



## నూతన ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

**- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



**వనపర్తి టౌన్,ఆగస్టు 25, ప్రభాతవార్త:** జిల్లాలో నూతన నూతన ఓటర్ల నమోదు, సవరణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఈనెల 26, 27వ తేదీలతో పాటు సెప్టెంబర్ 2,3 తేదీలలో జిల్లాలో ఉన్న 296 పోలింగ్ బూత్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు సంబంధిత పోలింగ్ బూత్‌కు సంబంధించిన ఓటరు జాబితాను పట్టుకుని ఉంటారన్నారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 సం.లు పూర్తి చేసుకోబోయే యువతీ యువకులు, ఓటర్లందరూ తమ పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించుకోవాలన్నారు. ఒకవేళ తన పేరు ఓటరు జాబితాలో లేకున్నా, లేదా ఏదైనా మార్పులు చేర్పులు చేయించుకోవాలనుకున్న అక్కడే బూత్ లెవెల్ ఆఫీసర్ సంబంధిత ఫారంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్, దివ్యాంగులు అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటు కలిగి ఉన్న వారు సైతం మరొకసారి తమ పేరును జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే ఫారం7 లేదా8 ద్వారా సరి చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బిజెపి కార్యకర్తలు ముందస్తు అరెస్టు

**ఉప్పునుంతల,ఆగస్టు 25 ప్రభాతవార్త:** కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి బిజెపి కార్యకర్తలు వెళ్లకుండా ఉప్పునుంతల పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లడానికి సమాయత్తం అవుతుండగా ఎక్కడికక్కడ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తోళ్ల మహేష్‌యాదవ్, మండల సోషల్ మీడియా ఇంఛార్జి రవిచంద్ర, బూత్ అధ్యక్షుడు శ్రీనివాసులు, పాత్కుల శేఖర్, తోళ్లశేఖర్ యాదవ్, మదునాగుల సైదులు, ఆంజనేయులు,రాజు, బిజెపి కార్యకర్తలు ఉన్నారు.



## ఘనంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జన్మదినోత్సవం

**వెల్దండ, ఆగస్టు 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఎమ్మెల్యే జైపాల యాదవ్ జన్మదిన వేడుకలను వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేరిట ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను తీసుకొచ్చి భూపతిరెడ్డి, జయప్రకాష్, కాదూరాంలు కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నాయకత్వంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, రాబోవు రోజుల్లో మరింత ఉన్నత పదవులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయప్రకాష్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ భాస్కర్‌రావు, కోఆప్షన్ సభ్యులు ఎండీ.అలీమ్, సర్పంచ్‌లు రామకృష్ణ, కుమార్,ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్‌లు నిరంజన్, నర్సింహ్మా ముదిరాజ్, జిల్లా డైరెక్టర్ క్యాసారపు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిఅలీ,నాయకులు శంకర్, జంగయ్య, ప్రభాకర్, కృపానందం,వెంకటేష్ ముదిరాజ్, ఆనంద్, జంగిలి యాదగిరి, గోపాల్‌నాయక్, శేఖర్, ప్రసాద్, భయ్య మల్లయ్య, సమీర్ అహ్మెద్ షేక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## మంత్రి కృషితో వనపర్తి జిల్లా అన్ని రంగాల్లోను అభివృద్ధి

**వనపర్తి టౌన్ ,ఆగస్టు25, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషితో వనపర్తి జిల్లా అన్ని రంగాల్లోను సమగ్ర అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, జిల్లా వక్ఫ్‌ఆస్తుల రక్షణ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు షేక్ జహంగీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సాగునీరు తాగునీరు అవసరాలను తీరుస్తు విద్యా, వైద్య రంగంలోను జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నాని ఆయన పేర్కొన్నారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సేవలతో జిల్లాలోని దళిత, గిరిజన, మైనార్టీ, బీసీవర్గాల ప్రజలలో ఎనలేని అభిమానాన్ని సంపాధించుకున్నారని వివరించారు. రాబోయే అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి మరోసారి విజయఢంకా మోగిస్తారని లక్ష మెజార్టీతో ఘన విజయం సాధించారని ఆయన పేర్కొన్నారు.

## మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

**వీపనగండ్ల,ఆగస్టు 25, ప్రభాతవార్త:** శనివారం జరగవలసిన వీపనగండ్ల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేశామని ఎంపీడీవో కథాలప్ప తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు కొల్లాపూర్ ఎమ్మెల్యే చేతుల మీదుగా బీసీ బంధు, మైనార్టీ బంధు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉన్నందువలన సర్వసభ్య సమావేశం వాయిదా వేయడం జరిగిందని తెలిపారు.

### సీఎం కెసిఆర్ ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని..

# కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త :** రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు డికె అరుణ సూచన మేరకు అన్ని కలెక్టర్ కార్యాలయాల దగ్గర ధర్నా కార్యక్రమం జిల్లా కేంద్రంలోని డికె బంగ్లా నుండి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేసుకుంటూ ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం దగ్గర రాష్ట్ర ముఖ్యంత్రి కెసిఆర్ ఇచ్చిన వాగ్దానాలు అన్ని నెరవేర్చాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ తొమ్మిది సంవత్సరాల నుండి పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూంలు ఇస్తానని చెప్పి మోసం చేసి ప్రజలను మభ్యపెట్టాడు. డబుల్ బెడ్‌రూంలు ఇవ్వకపోగా 1700ల ప్లాట్ల పట్టాలు లాక్కుని పేద ప్రజల కడుపు కొట్టడం జరిగింది. నర్సింగ్ కాలేజీలకు స్థలం ఇవ్వాలనుకుంటే స్థలం సేకరించి ఇవ్వాలని అన్నారు. దీనితోపాటు ప్రధానమంత్రి దేశవ్యాప్తంగా ప్లాట్ల పట్టాలు గుంజుకుని పేద ప్రజల కడుపు కొట్టడం జరిగింది. నర్సింగ్ కాలేజీలకు స్థలం ఇవ్వాలనుకుంటే స్థలం సేకరించి ఇవ్వాలని అన్నారు. దీనితో పాటు ప్రధానమంత్రి దేశ వ్యాప్తంగా 2017లో ప్రధానమంత్రి ఆవాసన యోజన కార్యక్రమం మొదలుపెట్టారని దాని ముఖ్య ఉద్దేశం. దేశంలో గుడిసెలేని భారతదేశంగా సంకల్పంతో బృహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టాడు. దీనిలో భాగంగా 28 రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని కోట్లలో ఇండ్లు కట్టుకుని గృహ ప్రవేశాలు చేయడం జరిగింది. ఈ దుర్మార్గపు ముఖ్యమంత్రి కెసిఆర్ మొదట విడతగా రాష్ట్రానికి 3 వేల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెడితే ఆ డబ్బును ఇతర పథకాలకు దారి మళ్లించాడు. నిజంగా కేంద్ర ప్రభుత్వ పథకం స్వీకరించినట్లయితే తెలంగాణలో గుడిసె లేని తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడుతుందని 25 లక్షల పేద ప్రజలకు లబ్ధిపొందేవారని అన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, జిల్లా బిజెవైఎం నాయకులు, పట్టణ నాయకులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

# ఇంటింటి సౌభాగ్యం, వరలక్ష్మి వ్రతం..!!

**ఊరూరా వ్రతాలు.. ఇంటింటా మంగళతోరణాలు.. ఘనంగా పుణ్యస్త్రీల వరలక్ష్మి వ్రతాలు..**

**భూత్పూర్,ఆగస్టు 25 ప్రభాతవార్త :** ప్రతిఏటా శ్రావణమాసం రెండో శుక్రవారం వచ్చే శుక్రవారాన్ని మంగళ పద్రంగా స్త్రీలు వరలక్ష్మి వ్రతాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఇంటి సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ అమ్మలక్కలు, ఆడపడుచులు, పుణ్యస్త్రీలు ఎంతో నిష్టతో ఉంటూ పొద్దున్నే తలంటు స్నానాదుల్ని ముగించుకుని పట్టువస్త్రాలు ధరించి ఇంటి దేవుడి గదిని శుచి, శుభ్రంగా అలంకరించి పట్టువస్త్రాలు ధరింపజేసి నగలతో అందంగా అలంకరించి, పసుపు, కుంకుమలతో గౌరమ్మల నుంచి లక్ష్మిదేవిని ఆహ్వానించి ప్రత్యేకపూజలు చేస్తారు. వరలక్ష్మి వ్రత మహిమను గురించి సాక్షాత్తు పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పాడట. పార్వతీదేవి భూలోకంలో భక్తులు కరువు కాటకాలు, దారిద్ర్యంతో ప్రజలు అల్లాడిపోతున్నారని దీనికి సరైన నివారణోపాయం, పూజా విధానం తెలుపమని కోరగా ఆ పరమేశ్వరుడు వరలక్ష్మి వ్రతాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే అన్ని శుభాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, సాక్షాత్తు వ్రతం ఆచరించిన ఇంట తిష్ట వేసుకుని కూర్చుంటుందని పార్వతీదేవికి చెప్పాడట. ఇంతటి మహిమాన్విత వరలక్ష్మి వ్రతం నిష్టతో ఆచరించిన ఇంటిని సౌభాగ్యలక్ష్మి ఇష్టపడుతుందని చెప్పాడట. అందుకే వరలక్ష్మి వ్రతం విశిష్టత చాలా పవిత్రమైంది. ప్రతి మహిళ ఆచరింప దగ్గదని పురాణాలు చెబుతున్నాయి.



### ఉపాధ్యాయుల్లో సామర్థ్యాల పెంపునకు ప్రత్యేకంగా

## టీచర్ ఇన్నోవేషన్ రెపోసిటరీ పోర్టల్: జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో సృజనాత్మకత, వినూత్నమైన ఆలోచన, సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, టీచర్స్ ఇన్నోవేషన్స్ రెపోజిటరి (టీఐఆర్) పేరిట పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల కుమార్ దీపక్, డీఈఓ గోవిందరాజులు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డిలతో కలిసి టీచర్స్ ఇన్నోవేషన్స్ రెపోజిటరి (టీఐఆర్) పోర్టల్ అవగాహన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పోర్టల్ తెలుగు, ఇంగ్లీష్‌భాషలో సమాచారాన్ని పొందుపరుస్తారని, విద్యావేత్తల సంఘం మధ్య అనుసంధాన కర్తగా ఉంటుందన్నారు. ఇందులో నిత్యం ప్రొగ్రాం ఈవెంట్స్ ద్వారా ఉపాధ్యాయులను ఉత్తేజ పర్చనుందని తెలిపారు. ఇందులోభాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులతో పాటు పురస్కారాలు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పోర్టల్‌ను జిల్లాలోని ఉపాధ్యాయులందరు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటుకోవాలని కలెక్టర్ తెలిపారు.



గోడ పత్రికను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్

## సెకండ్ ఎఎన్ఎంల సమ్మెకు బిజెపి నేతల మద్దతు..

**ఏఐటియుసి సమ్మె శిబిరాన్ని సందర్శించిన నాయకులు**

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** రెండవ ఎఎన్ఎంలను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న సమ్మెలో భాగంగా నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె 10 రోజుకు చేరుకుంది. రెండవ ఎఎన్ఎంల యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర సమితి ఇచ్చిన రోజువారి నిరసన పిలుపులో భాగంగా, ఎఎన్ఎంల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శ్రావణ శుక్రవార వరలక్ష్మి వ్రత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండవ ఎఎన్ఎంల సమ్మెకు బిజెపి నాయకులు జితెందర్‌రెడ్డి, పడకుల శ్రీనివాస్, సత్తయ్యయాదవ్, భాస్కర్ తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ రెండవ ఎఎన్ఎంలు చేస్తున్న పోరాటం న్యాయమైనదేనని, గత 18 సంవత్సరాల నుంచి రేయింబవళ్లు విధులు నిర్వర్తిస్తున్నా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడిచినా వారిని రెగ్యులరైజ్ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నోటిఫికేషన్‌ను ఇచ్చి, రెండవ ఎఎన్ఎంల ఉద్యోగ భద్రతకు విఘాతం కలిగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య విధానాన్ని ఖండించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అక్రమ నోటిఫికేషన్‌ను రద్దుచేసి రెండవ ఎఎన్ఎంలను భేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఎఎన్ఎంల యూనియన్ నాయకులు, ఏఐటియుసి నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న, నాయకులు సబిత, రాణి, లక్ష్మి, సుమిత్ర, స్వరూప, చంద్రకళ, దేవిక, గిరిజ, అనసూయ, వెంకటేశ్వరమ్మ, అనురాధ, భారతి పాల్గొన్నారు.



ఎఎన్ఎంల సమ్మెకు మద్దతు తెలిపిన బిజెపి నాయకులు

## బీఆర్ఎస్ పార్టీతోనే గ్రామాలాభివృద్ధి

**-పార్టీ జెండాలను ఆవిష్కరించిన సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి**

**వెల్దండ, ఆగస్టు 25 ప్రభాత వార్త:** బీఆర్ఎస్ పార్టీతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో మండల, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో వేర్వురుగా పార్టీ జెండాలను గ్రామ కమిటీ అధ్యక్షులు పిల్లి దేవేందర్, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణ ప్రాంతం అభివృద్ధిలో వెనుకకు నెట్టివేయబడిందని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీగా పురుడు పోసుకొని కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి 9 ఏళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజలందరు బీఆర్ఎస్ పార్టీ పాలన వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయప్రకాష్, రైతు సమన్వయసమితి కన్వీనర్ భాస్కర్‌రావు,కోఆప్షన్ సభ్యులు ఎండీ.అలీమ్, సర్పంచ్‌లు రామకృష్ణ, కుమార్, ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్‌లు నిరంజన్,నర్సింహ్మాముదిరాజ్, జిల్లా డైరెక్టర్ క్యాసారపు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి అలీ, నాయకులు శంకర్, జంగయ్య, ప్రభాకర్, కృపానందం,వెంకటేష్ ముదిరాజ్,ఆనంద్,జంగిలి యాదగిరి, గోపాల్ నాయక్, శేఖర్, ప్రసాద్, భయ్య మల్లయ్య, సమీర్ అహ్మెద్ షేక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## ఇస్రోలో గద్వాల వాసి ఉండడం చాలా గర్వకారణం

**అఫ్రోజ్ తల్లిదండ్రులను సన్మానించిన జడ్పీ ఛైర్‌పర్సన్ సరితమ్మ**

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త :** చంద్రుడిపై చంద్రయాన్ 3 విజయవంతంగా మోపిన వేళ యావత్ ప్రపంచంలోనే భారత్ ఆదర్శంగా నిలవడంలో గద్వాల వాసి ఉండడం చాలా గర్వకారణమని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, జడ్పీ ఛైర్‌పర్సన్ సరితమ్మ అన్నారు. గద్వాల మోహిన్‌లకు చెందిన అఫ్రోజ్ ఉండడంతో ఎంతో గొప్పగా భావించాలి. అఫ్రోజ్ తల్లిదండ్రులను జడ్పీ ఛైర్‌పర్సన్ సరితమ్మ సన్మా నం చేశారు. 2018 నెల్లూరులో శ్రీహరికోటలో ఇంజనీరింగ్‌గా చేరి చంద్రయాన్ సాలిడ్ రాకెట్‌ను తీసుకువెళ్లే మోటార్స్, బూస్టర్ డివిజన్ ఎస్ 200 (సిస్టం రియాలిబిలిటి) క్వాలిటీ ఇంజనీరింగ్‌గా పని చేశారు. వీరి వెంట కౌన్సిలర్‌వసీమబేగం,ఇసాక్, మైనార్టీ సెల్ జిల్లా ఛైర్మన్ కిఫాయితుల, కౌసర్,ఇలియాజ్, అన్సార్,అతిక్,అమరవాయి కృష్ణారెడ్డి,లత్తిపురం వెంకట్రామిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రఫీక్,ధరూర్ రవి, జోషి ఉన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన ఎన్‌పీ వెంకటేశ్

**- కండువా కప్పి ఆహ్వానించిన టీపీసీసీ అధ్యక్షుడు**



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు25, ప్రభాతవార్త:** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తన సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహబూబ్‌నగర్‌కు చెందిన బీసీ నేత, బీజేపీరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్‌పీ వెంకటేశం శుక్రవారం హైదరాబాద్‌లో డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు రేవంత్‌రెడ్డి ఎన్‌పీవెంకటేశానికి కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ,బీఆర్ఎస్ ఒక్కటేనని,రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని ఆరోపిస్తూ తాను బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్‌పీ వెంకటేశంకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీ కేంద్రంగా కలిసిపోయాయని ఆయన వెల్లడించారు. కుమ్మక్కు రాజకీయాలపై మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లురవి,ఎర్రశేఖర్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్, జనంపల్లి అనురుధ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వసంత రాఘవేంద్రరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

**భూత్పూర్,ఆగస్టు25 ప్రభాతవార్త:** గుండెపోటుతో హఠాన్మరణం చెందిన బాల్య మిత్రుడి కుటుంబాన్ని మానవతా దృక్పథంతో ఇతోధిక సహాయం చేసి ఆదుకున్న బాల్య మిత్రుల ఉదంతం శుక్రవారం భూత్పూర్ మండల హస్నాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే తమ చిన్ననాటి బాల్యమిత్రుడు1996,97 ఎస్ఎస్‌సి బ్యాచ్ నర్సింహ(43) గుండెపోటుతో మృతి చెందగా తోటి మిత్రులైన తోక శివశంకర్‌గౌడ్,బాలరాజు, ప్యాట శ్రీనివాస్, రామస్వామి,గడ్డంఎల్లప్పలు కలిసి రూ.41 వేలు పోగు చేసుకుని మిత్రుడు కుటుంబానికి తమవంతుఆర్థిక సహాయం అందించారు.రూ.41 వేలలోరూ.37 వేలు మృతుడి భార్య, పిల్లలకు ఇచ్చి, మిగిలిన రూ. 4 వేలను మృతుడి తండ్రికి ఇచ్చి తమ స్నేహం విలువతోపాటు మానవతను చాటుకున్నారు.

## వైభవంగా వరలక్ష్మి వ్రతాలు



**నవాబ్‌పేట,ఆగస్టు25 ప్రభాతవార్త:** ఇప్పటూర్ గ్రామంలో వరలక్ష్మి వ్రతం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వ్రతంలో కూర్చున్న మహిళా భక్తులకు చీరలు పంపిణీ చేశారు. చీరల దాతలు శివాంజనేయ దేవస్థాన కమిటి ఛైర్మన్ కొత్తప్రకాష్‌డీలర్, పిఏసిఎస్ భూపాల్‌రెడ్డి, ఆలయ కమిటి ఉపాధ్యక్షులు కె. బాలచంద్రుడులు ముగ్గుల చీరలుపంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గౌసియా అబ్దుల్, ఎంపిటిసి నవనీత్,ఉపసర్పంచ్ రవికిరణ్, గ్రామ పెద్దలు వీరనారాయణచారి, సూర్యప్రకాష్, రవిగౌడ్, కొత్త బాలాజీ, శివరాజ్, రాఘవేంద్ర, వెంకటయ్యచారి, భక్తులు, భజనపరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఉప్పునుంతల,ఆగస్టు 25 ప్రభాతవార్త:** శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం నాడు వరలక్ష్మివ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలలో పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల శివాలయంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అదేవిధంగా సామూహిక వ్రతాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్ట సరితానంతరెడ్డి, కట్ట సుగుణమన, సూరం అరుణమ్మ, కొత్త నారాయణమ్మ,కొత్త యశోద, మంజుల, పద్మ, సునిత అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ఘన స్వాగతం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

**వీపనగండ్ల,ఆగస్టు25, ప్రభాతవార్త:** కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి అసెంబ్లీ టికెట్ కేటాయించిన తరువాత మొదటిసారిగా కొల్లాపూర్‌కు వస్తున్న సందర్భంలో వీపనగండ్ల మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యేకు డప్పులతో, డోలు వాయిద్యాలతో,కళాకారుల ఆటపాటలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వచ్చే అసెంబ్లీ ఎన్నికలలోఎమ్మెల్యేగా టికెట్ కేటాయించి నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నా మీద నమ్మకంతో టికెట్ కేటాయించినందుకు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు, కార్యకర్తలు,మహిళలు, ప్రభుత్వం చేపట్టి అమలు పరిచిన సంక్షేమ పథకాలు తప్పకుండా నన్ను కొల్లాపూర్ ఎమ్మెల్యేగా గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అదే విధంగా వీపనగండ్ల మండల ప్రజలకు గోవర్ధనగిరి నుండి కొల్లాపూర్‌కు వెళ్లే బీటీ రోడ్డు చిరకాల కోరికగా ఉండేదని ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకుని వెంటనే బీటీ రోడ్డు వేయించానని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి అంబులెన్స్ కేటాయించానని,అదే విధంగా 30 పడకల ఆసుపత్రిని ప్రారంభించుకున్నామని, మండల కేంద్రాన్ని చాలా అభివృద్ధి చేశానని అన్నారు. ఈ మండలాన్ని ఇంకా ఎంతో అభివృద్ధి చేసే అవకాశం ఉందని కావునా వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో నన్ను కొల్లాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే తనయుడు

**ప్రజల నుండి ఎవరు దూరం చేయలేరు: ఎమ్మెల్యే సతీమణి, బురెడ్డిపల్లి సర్పంచ్ బండ్ల జ్యోతి**

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త:** గద్వాల మండలంలోని అనంతపురం గ్రామంలో ఇంటింటికి కృష్ణన్న ప్రచారంలో భాగంగా ముఖ్య అతిథిగా తనయుడికి తోడుగా ఎమ్మెల్యే సతీమణి బూరెడ్డిపల్లి సర్పంచ్ బండ్ల జ్యోతి, ఎమెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణికి, తనయుడుకు గ్రామ ప్రజలు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ఆధ్వర్యంలో దాదాపు 30మంది బిజెపి, కాంగ్రెస్ పార్టీల నుండి చేరారు. ఎమ్మెల్యే సతీణి బండ్ల జ్యోతి మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నుకోడిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కోర్టును ఆశ్రయించి తప్పుదోవ పట్టించి అనర్హత వేటు వేసిన డికెఅరుణకు ప్రజలు బుద్ది చెప్పినరేపుజరగబోయే ఎన్నికలలోకూడాబుద్ధి చెప్తారన్నారు. ఇన్నాళులన పరిపాలించిన డికె అరుణ వల్లమన బతుకులు ఏమైనా మారాయా అన్నారు. డికెఅరుణ వల్ల గద్వాల నియోజకవర్గానికి ఒరిగిందేమి లేదన్నారు. రేపు జరగబోయే ఎన్నికల్లో ప్రజల మనిషి అయిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై గెలవండి అప్పుడు తెలుస్తుంది. మీ సత్తా ఏంటో గద్వాల నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైకనాయకుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్‌రెడ్డి మాట్లాడుతూ ఆరిపోయే దీపానికి వెలుతురు ఎక్కువ అనే సామెత నేడు మననియోజకవర్గంలో కళ్లెదుట కనిపిస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎవరు నిరాశ పడకండి కేవలం ఇది మన విజయానికి ఒక సంకేతం అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్, జిల్లా రైతు సమన్వయ సమితిఅధ్యక్షులు చెన్నయ్య,ఎంపిపిప్రతాప్‌గౌడ్, జడ్పీటిసి ప్రభాకర్‌రెడ్డి, పిఏసిఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సంజీవులు,బిఆర్ఎస్ పార్టీమండల అధ్యక్షులు రాముడు, పార్టీ సీనియర్ నాయకులునాగర్‌దొడ్డివెంకట్‌రాములు, రమేష్‌నాయుడు, జయరాంరెడ్డి, సత్యరెడ్డి,గోపిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీచుపల్లి, జగదీశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాముడు,పూడూరుచిన్నయ్య,బికెఎంఆర్ యూత్ ఫోర్స్ సభ్యులు చక్రధర్‌రెడ్డి,సాయిశ్యామ్‌రెడ్డి,యూత్ సభ్యులు పలు మండలాల పార్టీ యూత్ అధ్యక్షులు వేణు, పురుషోత్తంరెడ్డి, ప్రవీణ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే తనయుడు

# సబ్బండ వర్గాల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం

**● ప్రజా పరిపాలన దార్శనికుడు సీఎం కెసిఆర్ : అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహాం**

**అలంపూర్,ఆగస్టు 25 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోని గత 9 ఏళ్లలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 7 మండలాల పరిధిలో గ్రామాల వారికి 3 మున్సిపాలిటీ పరిధిలోని బిసి కులవృత్తులకు లక్షరూపాయల చెక్కులను 294 మంది లబ్దిదారులకు వారు పంపిణీ చేశారు. చేతివృత్తులు చేసుకుని జీవిస్తున్న వెనుకబడిన తరగతుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అని వారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అందిస్తున్న ఆసరా సాయం అసహాయుల జీవితాల్లో ఉషోదయం అని అన్నారు. అత్యధికంగా పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని ఆయన అన్నారు. గడిచిన ప్రభుత్వ హయాంలో 70 రూపాయల పెన్షన్ ఇస్తే నేడు వృద్ధులు, వితంతువులకు, చేనేత, బీడీ కార్మికులకు రూ. 2016, వికలాంగులకు రూ. 3016ల నుంచి రూ. 4016అందిస్తున్న ప్రభుత్వం అన్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా తెలంగాణ దళిత బంధుతో దళిత సాధికారత కోసం నిర్విరామంగా కృషిచేస్తున్న సీఎం కెసిఆర్ అన్నారు. సమైక్య రాష్ట్రంలో ఆగమైన తెలంగాణ స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు పథకం, రైతుభీమా పథకం, కెసిఆర్ కిట్ పథకం, ఆరోగ్యలక్ష్మి, కంటివెలుగు, తెలంగాణ హెల్త్‌ప్రొఫైల్ ప్రాజెక్టు, తెలంగాణ డయాగ్నోస్టిక్ మొబైల్ యాప్, కెసిఆర్ న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళ,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహాం

గృహలక్ష్మి,ఆహార భద్రత డబుల్ బెడ్‌రూం, చేనేత లక్ష్మి, గొర్రెల పంపిణీ, చేనేత మిత్ర, నేతన్న భీమాపథకం ఇలా ఎన్నో పథకాలు ఉన్నాయని తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఆగస్టు 25 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రాత:కాల పూజలు, అమ్మవారికి అభిషేకం,కుంకుమార్చన గావించి 11 గంటల నుంచి మహిళలచే సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.అనంతరం తీర్థప్రసాద వితరణ, భక్తులకు భోజన ప్రసాదాన్ని దేవాలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్ బాబుఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలోఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీక్లబ్, వనితాక్లబ్, అవోపా మరియు ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికులా పనిచేయాలి

**ఉప్పునుంతల,ఆగస్టు 25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీగెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఏఐసి సి పరిశీలకులు పివిమోహన్, డిసిసి అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు వేర్వేరుగా ప్రసంగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీనిగెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. ఈసారి కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే అధోగతి ఏర్పడుతుందని నియంత పాలకు చరమగీతం పాడేందుకు కార్యకర్తలు కృతనిశ్చయంతో పని చేయాలని సూచించారు.మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దని ఇప్పటికే సామాన్య ప్రజలు బతికే రోజులు లేకుండా పోయిందని ప్రజలకు ప్రతి కార్యకర్త వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఏఐసిసి పరిశీలకులు పివి మోహన్, డిసిసి అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ,మండల పార్టీ అధ్యక్షుడు కట్టఅనంతరెడ్డి, జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ వేముల నర్సింహ్మారావు, మాజీ వంగూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పర్తి జగన్మోహన్‌రెడ్డి,తాలూకా నాయకులు న్యాయవాదిగంగపురంరాజేందర్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వెల్టూరి రేణయ్య,మండలయువజన కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడుమద్ది తిరుపతయ్యగౌడ్, మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, మండల కిసాన్ మేళా అధ్యక్షుడు గోపిరెడ్డి రమేష్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఆలూరి శ్రీనివాసులు, మండలంలోని పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి



తహసీల్దార్ బ్రహ్మంగౌడ్

**మూసాపేట,ఆగస్టు 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తహసిల్దార్ బ్రహ్మంగౌడ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీకరణ కార్యక్రమాన్ని ఆగస్టు 26,27 తేదీలలో సెప్టెంబర్ 2,3 తేదీలలో బూత్ లెవల్ అధికారి అన్ని పోలింగ్ స్టేషన్లలో ఉంటారు. 18 సంవత్సరాలు నిండిన వారు 18 సంవత్సరాలు నిండిపోయేవారు పూర్తిఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు కార్డు మార్పు చేర్పులపై పూర్తిస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఒక్కరికి ఓటుకార్డు దరఖాస్తు చేసే విధంగా సహకరించాలని కోరారు. బూత్ లెవల్ అధికారులను కోరారు. విద్యార్థులుపై చదువుల కొరకుఇతర ప్రాంతాలలో ఉంటున్న వారికి ఓటుహక్కు కల్పించే విధంగా గ్రామస్థాయిలో బిఎల్‌ఓలు, గ్రామ సర్పంచ్‌లు, విద్యార్థులకు ఓటు హక్కు కల్పించే విధంగా సహకరించాలని అన్నారు.

## నేడు ఉమామహేశ్వర ఆలయంలో లక్షబిల్వార్చన



**మక్తల్,ఆగస్టు 25 ప్రభాతవార్త:** పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో వెలసిన శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో నేడు 11వ వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సిద్దరామయ్య స్వామి, ఆలయ కమిటి సభ్యులు అక్కల సత్యనారాయణ, బి. ఆంజనేయులు సూర్య,పోలేపల్లి అనంతకుమార్, బి.శ్రీనివాసులు తెలిపారు.పట్టణంలో అతి పురాతనమైన ఆలయ జీవనోద్ధరణ పునర్నిర్మాణం విగ్రహ ప్రతిష్టాపన అనంతరం 11వ వార్షికోత్సవం జరగనుందన్నారు. ఈ సందర్భంగా నేడు తెల్లవారుజామున 4.30 గం.లకు స్వామివారికి మహన్యాస రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం కలశ స్థాపన గణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి పూజ,నాగదేవత పూజ,ఉమామహేశ్వరుల పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరంస్వామివారి అలంకరణ ఉంటుందన్నారు.ఉదయం 8.30 గం.లకు మహిళలచే కుంకుమార్చన, 10 గం.లకు స్వామివారికి లక్షబిల్వార్చన కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. 12.30 గం.లకు మహా మంగళహారతి తదుపరి 1గం.లకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుం దని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉమామహే శ్వరుల కృపకు పాత్రులు కావాలని కోరారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు పోలీసుల అనుమతి

**కెటిదొడ్డి,ఆగస్టు 25 ప్రభాతవార్త:** కెటిదొడ్డి మండల కేంద్రంలో శుక్రవారం కృష్ణం వందే జగద్గురుం శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో సెప్టెంబర్ 6వతేదీ శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు కెటిదొడ్డి, కొండాపూర్ గ్రామాలలో జరుపుకునేందుకు ఊరేగింపు కార్యక్రమానికి ఎస్సై. వి. వెంకటేష్‌ను కలిసి అనుమతి కోరారు. ఎస్సై వెంకటేష్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పాత కెటిదొడ్డిలో 13వ తేదీ ఉదయం ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. కొండాపురంలో మధ్యాహ్నం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కెటిదొడ్డి కమిటి అధ్యక్షుడు, సభ్యులు కృష్ణమూర్తి, ప్రసాద్, అంజి, రేణప్ప పాల్గొన్నారు.

# శుద్ధమైన తాగునీటిని అందించడమే లక్ష్యం

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**

**వెల్దండ, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ప్రతి గ్రామానికి, తాండాలకు శుద్ధమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వెల్దండ మండలం సిలోనిబావితండాలో గత పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శుక్రవారం గ్రామ సర్పంచ్ మంగ్లీ లాక్యానాయక్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, తండాలకు శుద్ధ జలాలు అందించడానికి కృషి చేస్తున్నట్లు, శుద్ధ జలాలు తాగడం ద్వారా అనారోగ్యాలకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదే విధంగా పోచమ్మగడ్డతండాలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి రూ.1 లక్ష విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శారద,



శుద్ధమైన తాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తాండ వాసులుహన్మంతు, చంద్యా, దేశ్య, మోత్య, లక్ష్మణ్, రవి, సురేష్, రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# సమాజంలోని అన్ని వర్గాలకు లయన్స్‌క్లబ్ సేవలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఆగస్టు25 ప్రభాతవార్త:** సమాజంలోని విభిన్న వర్గాలకు లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ద్వారా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం కల్వకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి జూలూరి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఆకలితో ఉన్న వారి కడుపు నింపడానికి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారన్నారు.కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బావండ్ల మధు సహకారంతో 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బావండ్ల మధు, క్లబ్ అధ్య క్షులు కలిమిచెర్ల రమేష్‌లు మాట్లాడుతూ క్లబ్ సేవలను సమాజంలో ఉన్న అందరికి అందిస్తున్నట్లు తెలిపారు.రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.దాత బావండ్ల మధు, ముఖ్యఅతిథి జూలూరి రమేష్‌బాబులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, కౌన్సిలర్ బోజిరెడ్డి, పీఆర్‌ఓ అప్పాయిపల్లి శ్రీనివాస్, శివ్వ జగదీశ్వర్, కలిమిచెర్ల గోపాల్, బాదం రఘు, మల్లయ్య తదితరులు ఉన్నారు.

# గుండెపోటుతో ఆశ వర్కర్ మృతి

**- లెప్రసీ సర్వే చేస్తుండగా ఛాతిలో నొప్పి**

**- జిల్లా ఆసుపత్రిలో మృతురాలికి వైద్య ఆరోగ్య శాఖ అధికారి నివాళి**

**వనపర్తి వైద్య విభాగం,ఆగస్టు 25, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పానుగల్ మండలం కదిరెపాడు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది.ఇందుకు సంబంధించిన వివరాలను తోటి ఆశకార్యకర్త వివరిస్తు శుక్రవారం ఉదయం పానుగల్ మండలంలో జయమ్మ ((52) ఆశా కార్యకర్త లెప్రసీ సర్వే చేస్తుండగా హఠాత్తుగా ఛాతిలో నొప్పి ప్రారంభమైంది.జయమ్మ నొప్పితో ఇబ్బంది పడుతుండగా పక్కనే ఉన్న మరో ఆశ కార్యకర్త ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకోమని లేదా, త్వరగా ఆసుపత్రికి వెళ్లమని చెప్పింది. దీంతో జయమ్మ మాఇంటికి వెళ్లి కుర్చీలో కూర్చోని అలాగే వాలిపోయయింది. జయమ్మ భర్త వెంటనే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే జయమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్నజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవిశంకర్ ఆసుపత్రికి చేరుకుని సంతాపం తెలిపారు.



మృతి చెందిన ఆశా కార్యకర్త జయమ్మ, ఆర్థిక సహాయం అందజేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్

అంత్యక్రియల నిమిత్తంఆర్థిదక సహాయం అందించారు.ఇలాంటి దురదృష్ట సంఘటనలు జరగడం బాధకరమని తెలిపారు.విధులు నిర్వహిస్తునే ఇలా హఠాత్తుగా మరణించిన తమకుఎలాంటి ఆరోగ్యభద్రత లేదని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన ఆశావర్కర్ జయమ్మకుటుంబం సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు.

## భారీ ర్యాలీగా బంగారు మైసమ్మ బోనాలకు

**- కాంగ్రెస్ నేతలతో కలిసి పాల్గొన్న జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**





**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు25, ప్రభాతవార్త:** జడ్చర్లలోని బంగారు మైసమ్మ బోనాలకు ఉత్సవాలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీగా తరలివచ్చారు. బోనాల పండుగకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మరో నేత ఫిరోజ్‌ఖాన్‌తో కలిసి అనిరుధ్‌రెడ్డి పెద్ద ఎత్తున ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు.అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. జడ్చర్లలో నిర్వహించే ప్రజాహిత పాదయాత్ర భారీ బహిరంగ సభ విజయవంతమయ్యేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడుబల్మూరు వెంకట్,నాయకులు వంశీచంద్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన పారుచర్ల, సోంపురం గ్రామస్తులు



డికె అరుణ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన దృశ్యం

**ధరూర్,ఆగస్టు25 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో డికె అరుణమ్మ బంగ్లాలో ధరూర్ మండలం (పారుచర్ల) సోంపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో భారతీయ జనతా పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి బిజెపి పార్టీలోకి బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఆహ్వానించారు. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దొంగ హామీలతో, మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని అన్నారు. మీకు అండగా నేనున్నానని భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు. పార్టీలో చేరిన వారిలో బుచ్చన్న, అంజి, సుదర్శన్, సవరన్న, నర్సింలు, తిమ్మప్ప, మనోజ్, సవరన్న, శంకరన్న,బుచ్చన్న,మల్దకల్, లాజర్, బాలగో విందు తదితరులు ఉన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణరెడ్డి, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ధరూర్ కిష్టన్న, సత్యన్న తదితరులు ఉన్నారు.

## నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఏఈ

**వనపర్తి టౌన్,ఆగస్టు 25, ప్రభాతవార్త:** పట్టణంలోని 22వ వార్డులో గతకొద్ది రోజులుగా లో వోల్టేజీ సమస్య ఉండడంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశానుసారం పట్టణంలోని విద్యుత్ సమస్యపై విద్యుత్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయగా , 22వ వార్డు కౌన్సిలర్ చీర్ల సత్యం సాగర్ వార్డులో ఉన్న లో వోల్టేజీ సమస్యపై విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. శుక్రవారం ఏఈ తులసి 22వ వార్డులోనూతనవిద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులతో పాటు ఆ వార్డు కౌన్సిలర్ చీర్ల సత్యం సాగర్, టీఆర్ఎస్ పార్టీ నాయకులు గంధం పరంజ్యోతి, ఎల్ఐసి కృష్ణ, మేకల మన్యం, కాలనీవాసులు పాల్గొన్నారు.కాలనీ వాసులకులో వోల్టేజీ సమస్య తీర్చినందుకు ఆవార్డు కౌన్సిలర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**భూత్పూర్,ఆగస్టు 25 ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన కెంద్యాల వెంకటేష్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్, అమిస్తాపూర్‌లోని వెంకటేష్ ఇంటికి స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచూరి చంద్రమౌళి, ఆగిరి సత్యం, గుంత తిరుపతి, రాచూరి గోపాల్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పౌరులు తమ పేర్లను నమోదు చేయాలి

**నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నారాయణపేట ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త :** ఆగస్టు 26,27, సెప్టెంబర్ 2,3 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన, అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండబోయేవారు నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన వారందరు, అక్టోబర్ 1, 2023 నాటికి 18సంవత్సరాలు నిండబోయే పౌరులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 26, ఆగస్టు 27, సెప్టెంబర్ 2,3 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక క్యాంపు నిర్వహించే సమయంలో సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితాలో అందుబాటులో ఉంటారని, ప్రజలు ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరు తమ పేర్లు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## నవోదయ దరఖాస్తుకు గడువు పొడిగింపు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశం కొరకు ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు గడువును విద్యార్థులు మరియు తల్లిదండ్రుల సౌలభ్యం కొరకు పరిపాలన కారణాల రీత్య ఈ నెల 31 వరకు పొడిగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ కోరారు. నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోరేటటువంటి అభ్యర్థులు ప్రస్తుతం 5వ తరగతి ఉమ్మడి జిల్లాలోనే చదువుతుండాలని, అభ్యర్థుల తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి జిల్లాలోనిదై ఉండాలని ఆయన అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా లైదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా ధరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.ఇందుకు ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన ధృవపత్రం, ఫోటోతో ధరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చునన్నారు. ఈ నెల 31న చివరి తేదీ అని, ఉమ్మడి జిల్లాలోని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు త్వరపడి తమ తమ పిల్లలను ప్రొత్సహించి అధిక సంఖ్యలో ధరఖాస్తు చేసుకునేలాచూడాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఆన్‌లైన్ ధరఖాస్తులో కులం,లింగం,ప్రాంతం, మీడియం మరియు వైకల్యం వివరాల్లో తప్పులుంటే సవరించుకునేందుకు చివరి తేదీ ముగిసిన అనంతరం రెండు రోజులు ఆన్‌లైన్ కరెక్షన్ సైట్ అందుబాటులో ఉంటుందన్నారు.

**వారధి ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో**

## వ్యాసరచన మరియు ఉపన్యాస పోటీలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 25 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, కేజీబీవీ మరియు మోడల్ స్కూల్‌లో 9, 10వ తరగతులు చదివే విద్యార్థినీ, విద్యార్థులకు వారధి ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో వ్యాసరచన మరియు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దాగి ఉన్న సృజనాత్మకతను,పోటీ తత్వాన్ని వెలికి తీసే ఉద్దేశ్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. భారతదేశం సాధిస్తున్న మూడు ముఖ్యమైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు లేదా భారతదేశంలో అవినీతికి కారణాలు దీని నిర్మూలనకు నీవు ఇచ్చేసూచనలపై వ్యాసరచన పోటీలు, భారత్ భవిష్యత్తులో సాధించే సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు లేదా ఈనాటికి వరకట్న సమస్య ఎందుకందనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై అంశాల్లో పోటీల్లో పాల్గొనడానికి మండల స్థాయికి ప్రతి పాఠశాల నుంచి ఉపన్యాస పోటీలకు ఒకరు, వ్యాసరచన పోటీలకు ఒకరు చొప్పును పాల్గొంటారన్నారు. మండల స్థాయిల పోటీలు 28-08-2023,జిల్లాస్థాయి పోటీలు 30-08-2023 నాడు నిర్వహించబడుతాయన్నారు. మండల స్థాయి పోటీలు ఆయా మండల వనరుల కేంద్రాల్లో, జిల్లా స్థాయి పోటీలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించబడునని, మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి 9989921105ను సంప్రదించాలన్నారు.

## పశువైద్య శిబిరం ప్రారంభం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి, ఆగస్టు25 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండలం దేశిటిక్యాల గ్రామంలో పశువైద్య శాల సబ్ సెంటర్ పరిధిలోని క్రాస్ రోడ్డులో నిర్వహించిన పశువులకు గాలి టీకా, ముద్దచర్మ వ్యాధి టీకాలు, నట్టల నివారణ మాత్రల పంపిణీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా పశువైద్య శాఖ అధికారి రమేష్ అకస్మికంగా సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. పశువులకు ఏ మోతాదులో టీకాలు అందించాలో సిబ్బందికి సూచించారు. ప్రజలందరు పశువైద్య శిబిరం ద్వారా అందించే టీకాలు, మాత్రలను తమ పశువులకు తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కల్పన, వెటర్నరీ అసిస్టెంట్ పి.శ్రావణి, ఓఎస్‌లునిరంజన్,భాస్కర్, పుల్లయ్య, లింగస్వామి తదితరులు ఉన్నారు.

## ఇంటింటికి పూల మొక్కల పంపిణీ



మొక్కల పంపిణీ కార్యక్రమం చేపడుతున్న దృశ్యం

**కల్వకుర్తి, ఆగస్టు25 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపల్‌లోని 13వ వార్డులోని గాంధీనగర్, వాసవీనగర్ కాలనీల్లో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ రకాల పూల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహద పడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్‌లో భారీగా చేరికలు



పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి,ఆగస్టు 25 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నారాయణపేట మండలం బొమ్మన్‌పాడు గ్రామానికి చెందిన 110 మంది కాంగ్రెస్, బిజెపి పార్టీల కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా గ్రామస్థాయి నుండిరాష్ట్ర స్థాయివరకు అనేకసంక్షేమ పథకా సీఎం ప్రవేశపెడుతున్నారని ఆ పథకాలకు ఆకర్షితులై వివిధ రాజకీయ పార్టీలను తిరస్కరించి టిఆర్ఎస్‌పార్టీలో చేరుతున్నారనిఅన్నారు.కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు,మండలముఖ్యనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వరలక్ష్మి పూజ

**ఉట్కూర్,ఆగస్టు 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.పాఠశాల ప్రధానాచార్యులు భీంరాజు,పాఠశాల అధ్యక్షులు జగన్నాథరావు, పాఠశాల సమితి కార్యదర్శి నరసింహప్ప, జిల్లా సమితి సభ్యులు వెంకటనారాయణలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి భూత్పూర్ రూరల్ అధ్యక్షుడికి సన్మానం

**భూత్పూర్,ఆగస్టు 25 ప్రభాతవార్త:** బిజెపి భూత్పూర్ రూరల్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన రాంరెడ్డిని శుక్రవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, దేవర కద్ర బాలన్న, గంగాపురం రవిందర్, రవిందర్‌గౌడ్, పట్నం శ్రీను, పరమేష్ పాల్గొన్నారు.

# రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ**



**పరిగి ఆగస్టు25,ప్రభాతవార్త :** రోడ్లకు ఇరువైపులా పెద్ద మొత్తంలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించే మెగా ప్లాంటేషన్‌లో భాగంగా పరిగి మున్సిపల్ మండలంలోని పలు గ్రామాలలో అదనపు కలెక్టర్ పర్యటించి మొక్కలు నాటే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులు,ప్రకృతి వనాలు వైకుంత దామల నిర్వహణను పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ప్రాధాన్యతినిస్తూ రెండు మూడు వరసల్లో ఎత్తైన మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ కృష్ణన్, డిపిఓ తరుణ్ కుమార్, ఎంపిడివో ,ఏపివో, తదితరులు పాల్గొన్నారు.

**పూడూరు మండలంలో...**

**పూడూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త :** రోడ్లకు ఇరుదైపుల పద్ధతి ప్రకారంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించే మెగా ప్లాంటేషన్ లో భాగంగా శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ, గొంగుపల్లి, చీలాపూర్, పూడూరు, దేవనోనిగూడ, తిమ్మాపూర్, సోమన్‌గుర్తి గ్రామాలలో అదనపు కలెక్టర్ పర్యటించి మొక్కలు నాటే ప్రాంతాలను, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలఅ నిర్వాహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహిక హరితోత్సవంలో భాగంగా రోడ్లకు ఇరువైపుల అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. రెండునుండి మూడు వరుసలలో గుంతలు తవ్వి పద్ధతి ప్రకారంగా మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ కృష్ణన్, డిపిఓ తరణ్‌కుమార్, ఎంపిడిఓ ఉమాదేవి, ఎపిఓ, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుపై అవగాహన కల్పించిన తహసీల్దార్ ప్రభులు



**చౌడాపూర్ ఆగస్టు25,ప్రభాతవార్త :** మండల కేంద్ర చౌడాపూర్ చెంచు కాలనీలో శుక్రవారం మండల తహసీల్దార్ ప్రభులు ఆధ్వర్యంలో ఓటర్ నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రభులు మాట్లాడుతూ...18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు అర్హులని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే బిఎల్‌ఓలకు శిక్షణ అందించామని తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఓటర్ కార్డ్‌లో ఏదైనా తప్పులు సరిదిద్దుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లింగప్ప, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, ఉప సర్పంచ్ శివ కుమార్, చెంచు కాలనీవాసులు పాల్గొన్నారు.

## వానాకాలం పంటలను నమోదు చేసుకోవాలి

**-జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్**



**చౌడపూర్ ఆగస్టు25,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పలు గ్రామాలలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ పర్యటించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల ప్రక్రియను ఆయా సర్వే నెంబర్ ఆధారంగా పంటలను పరిశీలించారు. వానాకాలంలో వేస్తున్న పంటల వివరాలను ,వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేసుకోవాలని వరి, పత్తి, మొక్క జోన్న ఆయా పంటలను పరిశీలించి ఎరువుల వాడకం గురించి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పథకంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి

**-వ్యకాస జిల్లా అధ్యక్షుడు అంజయ్య**

**యాచారం, ఆగస్టు 25 ప్రభాతవార్త**

తెలంగాణ రా ష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కింద అర్హులైన లబ్దిదారుల నుండి ధరఖాస్తులు స్వీకరించినందున గృహలక్ష్మి పథకంలో రాజకీయ జోక్యం లేకుండా అధికారులు నిష్పక్షపాతంగా అర్హులకు పథకం మంజూరయ్యేలా చూడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి. అంజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాలు, మూడు మున్సిపాలిటీలు ఉన్నాయని, ప్రభుత్వం నియోజకవర్గానికి 3 వేల ఇళ్ల మంజూరు చేస్తామని ప్రకటించిన నేపధ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 9 వేల ధరఖాస్తులు వచ్చాయన్నారు. రేషన్ కార్డులతో సంబంధం లేకుండా నిజమైన లబ్దిదారులను గుర్తించి గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని, అర్హులైన పేదలు అధికంగా ఉ న్నందున గృహలక్ష్మి పథకంలో ఇళ్ల సంఖ్యను పెంచి అర్హులందరికీ అందించేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బిజెపి నాయకుల అరెస్టు



బిజెపి నాయకలను అరెస్టు చేస్తున్న పోలీసులు

**యాచారం, ఆగస్టు 25 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి క్యాంపు కార్యాలయ ముట్టడికి పాల్పడిన సందర్భంగా శుక్రవారం బిజెపి నాయకలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భ ంగా బిజెపి మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న సబితా ఇంద్రారెడ్డి ఫార్మాసిటీకి వ్యతిరే కంగా మాట్లాడి బిఆర్ఎస్ పార్టీలో చేరిన తరువాత ఫార్మాసిటీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సీఎం కెసిఆర్‌తో రంగారెడ్డి జిల్లాకు ఎలాంటిటి లాభం లేదని రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రజావ్యతిరేక పాలనకు పాల్పడిన నాయకులందరికీ ప్రజా కోర్టులో శిక్ష ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కందుకూరు మం డల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుప్పాల శాంతికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రటరీ ఊటు నరేష్, యాచారం, కందుకూరు కార్యదర్శులు అమరేందర్, గొరిగె హరికృష్ణ, బిజెవై ఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వరుణ్, శ్రీనివాస్, లింగం యా దవ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ప్రజాగర్జన బహిరంగ సభను విజవంతం చేయాలి

**కందుకూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఈ నెల 26 వతేదీన చేవెళ్లలో జరిగే ప్రజా గర్జన భహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం కందుకూరు మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు ఎస్ క్రిష్ణానాయక్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిప్పలపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగానాయకులు మాట్లాడుతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాల వలన ప్రజలు విసిగిపోయారన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని జవాబుదారి తనం ఉండేదన్నారు. నేదు నియంతల పాలన సాగుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు మారాలంటే కాంగ్రెస్ పార్టీ పాలనద్వారానే సాధ్యమని ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానున్నదనిప్రజల కష్టాలు తీరనున్నాయన్నారు. ఈ మూడు మాసాల కాలం కీలకమైనవని కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ప్రజల నమ్మకాన్ని నిలిపాలని కోరారు. ఈ నెల 26 న చేవెళ్లలో జరిగే ప్రజా గర్జన భహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎస్సీ, ఎస్టి డిక్లరేషన్ చేయనున్నారని తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ శ్రేనులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కందుకూరు మండలంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల సమావేశం

# సకలజనుల ఆరాధ్యుడు సిఎం కెసిఆర్

**-బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

**-దివ్యాంగులకు రూ.4016 పింఛన్ పెంపు హర్షణీయం**



దివ్యాంగులకు పెంచిన రూ.4016 ఫించన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కెసిఆర్ మానవీయ కోణంలో ఆలోచించి..అందరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నారని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కొనియాడారు. మండల కేంద్రంలోని భారత్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన దివ్యాంగుల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు... దివ్యాంగులకు మరింత చేయూతనందించడానికి పింఛన్ రూ.3016 నుండి రూ.4016కు పెంచి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గత ప్రభుత్వాలు చాలీచాలని పింఛన్లతో ప్రజలను గోసబెట్టారని, ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత కడుపు నిండ పథకాలు ఇచ్చి అండగా నిలుస్తున్నారని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్, బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దివ్యాంగులకు ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారులకు పెంచిన రూ.4016లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపిపి కృపేష్, నర్మద, మున్సిపల్ చైర్‌పర్సెన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మెన్ ఆకుల యాదగిరి, డిఆర్‌డిఏ ఏపిఓ సూర్యకుమార్, ఎంపిడిఓలు మమతాబాయి, విజయలక్ష్మి, శ్రీనివాస్, వికలాంగుల హక్కుల పోరాట సమితీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాళ్ల జంగయ్య తదితరులున్నారు.

# ముదిరాజ్‌లకు రాజ్యాధికారం కట్టబెట్టాలే..

**-వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు ముదిరాజ్‌లకు సీట్లు కెటాయించాలి**

**-ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాసాని వీరేశ్**



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాసాని వీరేశ్

**వికారాబాద్, ఆగష్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏ పార్టీలో అయిన ఎమ్మెల్యే అభ్యర్థి లిస్టులో ముదిరాజ్ లకు 18 సీట్లు కేటాయించాలని, ముదిరాజ్‌లకు రాజ్యాధికారం కట్టబెట్టాల్సిందేనని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాసాని వీరేష్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని తేజ కన్వెన్షన్ హాల్లో జిల్లా ముదిరాజ్ సంఘం కార్యవర్గ సమావేశం ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని వీరేశ్ పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌లను గుర్తించకపోగా, ముదిరాజ్ లపై విషం చిమ్ముతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల లిస్టులో ఒక్క ముదిరాజ్ కు సైతం సీటు కేటాయించలేరని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. పార్టీలకతీతంగా సంఘం పని చేస్తుందని, పార్టీలు ముదిరాజ్‌లను గుర్తించాలని సూచించారు. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్ నియోజకవర్గం మాత్రమే ఎస్సీ రిజర్వు ఉందని, మిగిలిన 3 నియోజకవర్గాల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో ముదిరాజ్‌లు అత్యధికంగా ఉన్నారని, ముదిరాజ్ లలో ఐక్యత లేదని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయని, ఓటు రూపంలో ముదిరాజ్‌లు ఐక్యత చాటాలని సూచించారు. కాసాని జ్ఞానేశ్వర్ టీడీపీ జెండా ఎత్తుకున్నారని, అందులో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే అభ్యర్థుల లిస్టులో 60 సీట్లు బీసీ లకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అన్ని పార్టీల్లో ముదిరాజ్ లకు 18 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ లకు దామాషా ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయించి పదవులు ఇవ్వాలని పేర్కొన్నారు. ముదిరాజ్ ల కోసం జిల్లా కేంద్రంలో మహావీర్ ఆసుపత్రి ప్రక్కన ముదిరాజ్ భవనం నిర్మిస్తామని, కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మహరాజ్ మాట్లాడుతూ...ముదిరాజ్ ఓట్లు ముదిరాజ్ కు వేసుకోవాలని, తాండూరులో ముదిరాజ్‌ల సీటు వేరేవాళ్లకు ఇవ్వడం సరికాదన్నారు. 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఒక్క సీటు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అన్యాయానికి, ఇతర పార్టీలో మార్పు వచ్చే వరకు పోరాటం చేద్దామని సూచించారు. ముదిరాజ్‌లను అన్యాయం చేసే పార్టీలకు తప్పక బుద్ధి చెప్పాలని ఆయన ఉద్ఘాటించారు. ముదిరాజ్ హక్కుల కోసం ఎన్ని రోజులు పార్టీలకు ఊడిగం చేసిన లాభం లేదని, ఉద్యమాల ద్వారానే ముదిరాజ్‌లు హక్కుల సాధన అవుతున్నాయని అన్నారు. అన్ని పార్టీలకు దడ పుట్టాలని, ముదిరాజ్ లకు టిక్కెట్ కేటాయించే వరకు ఉద్యమాలు చేసేలా పిలుపు ఇవ్వాలని జిల్లా కమిటీ సభ్యులు విజయ్‌రాజ్ ధ్వజమెత్తారు. ముదిరాజ్‌లను బీసీ-డీ ంచి బిసి-ఏ లోకి చేర్చేలా ప్రభుత్వాల పై ఒత్తిడి తేవాలని, ఉద్యమాలతో మాత్రమే సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్, బీఎస్పీ తాండూరు ఇంచార్జి చంద్రశేఖర్ ముదిరాజ్, జిల్లా నాయకులు నాగయ్య, ఆర్.మల్లేశం, కల్కోడ నర్సింలు, శివరాజ్, పాండు, గోపాల్, అంజయ్య, మాణిక్యం, రాఘవేందర్, కర్ణం రఘు, సతీష్, ముకుంద నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**యాచారం, ఆగస్టు 25 ప్రభాతవార్త**

యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, టిపిసిసి కార్యదర్శి, ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యులు దండెం రాంరెడ్డి, సీనియర్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి, దండెం రాంరెడ్డిలు మాట్లాడుతూ మండల కేంద్రంలో సుమారు 60 ఏళ్ల క్రితం ఉన్న హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వానికి మెమొరాండం అందజేశారన్నారు. ఈ నెల 17న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు హాస్పిటల్ పున:నిర్మాణానికి శంఖుస్థాపన చేశారని, హాస్పిటల్ పున:నిర్మాణానికి రూ. 1.50 కోట్లు మంజూరు చేయడం సరికాదన్నారు. హైద్రాబాద్ నుండి నాగార్జునసాగర్ వరకు ఉన్న ఒకే ఒక్క ఆసుపత్రి ఇదొక్కటేనన్నారు. మండలం నుండి ప్రతి రోజు సుమారు 300 మంది వరకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటారన్నారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరినందున సుమారు రూ. 20 కోట్లు కేటాయించి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ పోరాటానికి దిగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపిపి దిండి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, హాతీరామ్, నర్సింగ్, కాంటేకర్ రాహుల్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిపిసిసి ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిలుక మదుసూధన్ రెడ్డిలు

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో వలసల పర్వం ప్రారంభమయ్యింది. బిఆర్ఎస్ మంచాల మండల యువజన విభాగం ఉపాధ్యక్షులు కొంకాని విజయ్ కుమార్ శుక్రవారం టిపిసిసి ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిలుక మదుసూధన్ రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే విదంగా బండలేమూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత్‌లోత్ శ్రీనివాస్, వార్డు సభ్యులు జనార్ధన్, సీనియర్ నాయకులు మల్లేష్, మాంఖాల దాసు, సాగర్, సోప్పరి రవి కుమార్ ఉన్నారు.

## బీసి బంధు కొందరికి కాదు... అందరికి ఇవ్వాలి

**-జనశక్తి జిల్లా అధ్యక్షులు నర్సింహా నాయి**

**మొయినాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసి బంధును కొందరికి కాకుండా, అందరికి ఇవ్వాలని, నాయిబ్రాహ్మణుల సంఘం జనశక్తి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంగళి నర్సింహా నాయి డిమాండ్ చేశారు, శుక్రవాయం ఆయన వార్త పత్రికతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చే అసెంబ్లి ఎన్నికలు రాక ముందే రాష్ట్రంలోని హర్హత కలిగిన ప్రతి బీసికి బీసి బంధు అందాలని డిమాండ్ చేశారు, ఎన్నికలు వచ్చేస్తున్నాయని, ఆయా మండలంలోని ఊరుకు 5 మంది చొప్పున ఇచ్చి చేతులు దులపుకోని, మిగితా వారికి ఆశచూపి బీసిల ఓట్లు దండుకోనే ప్రయత్నం ఇంక ఆపాలని ఆయన అన్నారు, రోజుకు ఒక్కరి ఇద్దరికి ఇచ్చి మిగితా వారిని ఊరించుకుంటు, కాలం వెలదీస్తున్నారని, పైరవీలు చేసిన వారికి మాత్రమే ఇవ్వడమేంటని ప్రశ్నించారు, పైరవీలకు తావులేకుండా, అధికారులు, ప్రభుత్వ పెద్దలు చోరవ తీసుకోవాలని కోరారు, బీసిల్లో ఎంతో మంది పేద వాళ్ళు ఉన్నారని, పైరవీలు చేత గాక మా జనశక్తి సంఘం చుట్లు తిరుగుతున్నారన్నారు, గ్రామాల్లో ఉండే సర్పంచ్‌ల, లీడర్‌లు చెప్పిన వారికి కాకుండా, ప్రతి ఒక్కరికి ఇవ్వాలన్నారు, దళిత బంధులా బీసి, బంధు నీరుగార్చేలా చేయొద్దని, విడుతల వారిగా ఇస్తు పోతే రాష్ట్రంలో అత్యధికంగా జనాభ కలిగిన బీసిలకు అందరికి వచ్చేసరికి ఎన్నిరోజుల కాలం పడుతుందో అధికారులకు, ప్రభుత్వానికి తెలియాదా! అంటు ప్రశ్నించారు, ఓట్ల రాజకీయాలకు తావులేకుండా, అందరికి పంచాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో బీసిల యొక్క సత్తా ఎంటో తెలంగాణ ప్రభుత్వానికి చూపిస్తామన్నారు, లేదంటే అందరికి వచ్చేంత వరకు బీసిలు రోడ్లు ఎక్కి ఉద్యమించాల్సి వస్తుందన్నారు, పైరవీలు చేసిన వారికి మాత్రమే పరిమితం కాకుండా, ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి లబ్ధి జరిగేట్లు ప్రభుత్వ చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆడబిడ్డ పెండ్లికి పుస్తెలు,మెట్టెలు అందజేత



శ్రీరంగవరం గ్రామంలో పుస్తె మట్టెలు అందజేస్తున్న జడ్పిటిసి శైలజ విజయనందరెడ్డి దంపతులు

**మేడ్చల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామానికి చెందిన మేడ్చల్ జడ్పిటిసి శైలజ విజయనందరెడ్డి, సర్పంచ్ విజయనందరెడ్డిలు పేదింటి ఆమ్మాయి పెండ్లి కోసం పుస్తె మట్టెలను అందించారు. వచ్చే శనివారం అదే శ్రీరంగవరం గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మీ కూతురు సంతోషి వివాహం ఉన్నందున ఆమెకు తమ వంతు సహాయంగా ఈ కానుకను అందించినట్లు వారు తెలిపారు. పేదలకు అండగా నిలిచే విదంగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపిటిసి కటికె ప్రకాష్, ఉప సర్పంచ్ నర్సింహ, వార్డు సభ్యుడు నాగార్జునరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హరితహారం నిర్వహణలో నిర్లక్ష్యం

**-అధికారులు నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్**



వంతెన పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

**ధారూర్ ఆగస్టు25,ప్రభాతవార్త :** హరితహారం మొక్కల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం పట్ల కలెక్టర్ నారాయణ రెడ్డి సీరియస్ అయ్యారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న హరితహారం మొక్కలు అస్తవ్యస్తంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని పెద్దఎత్తున్న వెచ్చిస్తూ నాటిన మొక్కల నిర్వహణ ఇంత అధ్వానంగా ఉండడం అధికారుల నిర్లక్ష్యాన్ని చాటుతోందని అన్నారు. కలెక్టర్ తోపాటు మండల స్పెషల్ ఆఫీసర్ మల్లేశం, ఎంపిడివో చంద్రశేఖర్, తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపివో షఫీ ఉల్లా ఖాన్, ఏపిఓ సురేష్, టిఏ వినయ్ ఉన్నారు.

**వంతెన పనులను పరిశీలించిన కలెక్టర్**

మండల పరిధిలోని దోర్నల్ నిర్మాణ దశలో ఉన్న వంతెన పనులను కలెక్టర్ నారాయణ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు పూర్తి చేయకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాగారం, మొమిన్ కలాన్, తరిగోపుల గ్రామాల ప్రధాన రహదారి కావడంతో సత్వరమే వంతెన నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడండి

**-ఆగపల్లి గ్రామ వార్డు సభ్యులు తహసీల్ధార్‌కు ఫిర్యాదు**



ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని మంచాల మండల తహసీల్ధార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆగపల్లి గ్రామ వార్డు సభ్యులు

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మంచాల మండలం ఆగపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానిక వార్డు సభ్యులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆగపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్: 187,191లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్ ఆర్ గ్రూప్ రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన సమంత్ రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేస్తున్నారని ఆ గ్రామ వార్డు సభ్యులు శుక్రవారం మంచాల మండల తహసీల్ధార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పక్కనే ఉన్న సర్వే నెం: 192, 193లో ఓ వెంచర్ ఏర్పాటు చేసి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని అందులో కలిపి వెంచర్ చేస్తున్నారన్నారు. కాగా ప్రభుత్వ భూమిలో రోడ్లు, ప్లాట్లు చేసి అమ్మకాలు సైతం జరుపుతున్నారని ఆరోపించారు. కబ్జా గురైన ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలకు ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసినవారిలో వార్డు సభ్యులు డి.శ్రీనివాస్, యాదమ్మ, బుర్ర రాధ, ఎండి ఉస్మన్, మాజీ ఎంపిటిసి బిక్షపతి, గ్రామస్తులు శ్రీరాములు ఉన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



మైసిగండి మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రత్యేక పూజలు

**కడ్తాల్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** మండలంలోని మైసిగండి గ్రామంలోని మైసమ్మ దేవాలయాన్ని శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాలతో సన్మానించి అమ్మవారి ఆశీస్సులు అందించి తీర్థ ప్రసాదాలు బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ఛైర్మన్ శిరోలి పంతునాయక్, జడ్పీటిసి దశరథ్‌నాయక్, సింగిల్‌విండో ఛైర్మన్ గంప వెంకటేష్‌గుప్తా, రైతు సమన్వయ కన్వీనర్ జోగు వీరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కంబాల పరమేష్, సర్పంచ్ తులసిరామ్‌నాయక్, బొప్పిడి గోపాల్, మొత్యానాయక్, టిక్‌లాల్ నాయక్, ట్రస్టు సభ్యులు భాస్కర్, ఉపసర్పంచ్ రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు మాదారం యాదగిరి, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## నా పరిధిలో దళిత, బిసి బంధు ఒక్కరికీ ఇవ్వలేదు

**-అందుకే రాజీనామా చేయబోతున్నా : ఎంపిటిసి సురేందర్‌రెడ్డి**

**శంకర్‌పల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రెండుసార్లు దళిత బంధు ప్రకటించినా తన పరిధిలోని గ్రామాల్లో ఒక్కరికి కూడా దళిత బంధు మంజూరు కాలేదనే ఆవేదనతో రాజీనామా చేయనున్నట్లు కొండకల్ ఎంపిటిసి బద్దం సురేందర్‌రెడ్డి ప్రకటించారు. తాను ఎంపిటిసిగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొండకల్, కొండకల్ తండా, శేరిగూడ గ్రామాలకు రెండు సార్లు ప్రభుత్వం దళిత బంధు ఇచ్చినా ఒక్క లబ్దిదారుడిని కూడా ఎంపిక చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మన్నగారి వెంకటరెడ్డితో కలిసి శంకర్‌పల్లిలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంపిటిసిగా ప్రాతినిధ్యం వహించే గ్రామాల్లో ఒక్కరికి కూడా దళిత బంధు మంజూరు కానందుకు తీవ్ర మనస్థాపం చెందానని తెలిపారు. అలాగే బిసి బందు కోసం 25 నుంచి 30 మంది దరఖాస్తు చేసుకుంటే ఒక్కరంటే ఒక్కరిని కూడా లబ్దిదారుడిని ఎంపిక చేయలేదని ఆవేదన వెలిబుచ్చారు. కొండకల్, శేరిగూడలో బిసి, ఎస్సీ జనాభా ఎక్కువగా ఉంటుందని, అలాంటిది వారికి న్యాయం జరగకపోతే ఎలా అని సురేందర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇక మైనార్టీ బందు అనేది దేవుడికే ఎరుక అని నిట్టూర్చారు. ఇంక పింఛన్ల సంగతి అయితే మరీ అధోగతి అని అన్నారు. 60 మంది దరఖాస్తులు చేసుకుని రెండేళ్లు అవుతున్నా ఒక్కరికి కూడా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపిటిసి అయినా వివక్ష చూపడం తగదని అన్నారు. ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేయకపోతే లబ్దిదారులను తీసుకుని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిల వద్దకు వెళతానని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేయకపోతే రాజీనామాకు వెనుకాడేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండకల్ ఎంపిటిసి బద్దం సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మన్నగారి వెంకటరెడ్డి